ఎఇ నిశ్చల్‌కి పలువురి అభినందన

ప్రజాశక్తి - పెరవలి

ఉత్తమ పురస్కారం అందుకున్న పెరవలి సబ్ స్టేషన్ ఎలక్ట్రికల్ ఎఇ ఎం.డేవిడ్‌నిశ్చల్‌కు పలువురు అభినందనలు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి, మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. ఎంపిపి కె.సీతారాంప్రసాద్, టిడిపి, జనసేన పార్టీల మండల అధ్యక్షులు అతికాల శ్రీను, పిప్పర రవికుమార్, డిసిఎంఎస్ మాజీ అధ్యక్షులు రవివర్మ, నాయకులు బొడ్డు రామాంజనేయులు, పసలపూడి భద్రయ్య, అబ్బిశెట్టి సత్తిరాజు, లైన్ ఇన్‌స్పెక్టర్ కెవి.సుబ్బారావు, జెఇ ఎ.రమేష్, లైన్‌మెన్‌లు బి.ప్రదీప్‌కుమార్, శేషగిరి, షిఫ్ట్ ఆపరేటర్ మూర్తి తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు

నో స్కూల్ బ్యాగ్ డే అమలేదీ?

- అమలు కాని ప్రభుత్వ ఆదేశాలు
- ప్రైవేటు విద్యాసంస్థల ఇష్టారాజ్యం
- నిర్లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పిల్లలపై చదువుల భారం పడకుండా, వారు మానసిక ఒత్తిడికి గురి కాకుండా విద్యా శాఖ నిర్ణయం మేరకు ప్రభుత్వం నెలలో మొదటి, మూడో శనివారంలో 'నో బ్యాగ్ డే' నిర్వహించాలని ఈ ఏడాది కూడా ప్రాథమిక పాఠశాలల అకడమిక్ క్యాలెండర్‌లో పొందుపరిచారు. ప్రభుత్వ నిబంధనలను ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. వారంలో ఒక రోజైనా చిన్నారులకు పుస్తకాలు మోసే బరువును తగ్గించాలని ప్రభుత్వం భావించింది. అందుకే నో స్కూల్ బ్యాగ్ డే విధానంలో భాగంగా నెలలో మొదటి, మూడు శనివారాల్లో స్కూల్‌కు చిన్నారులు బ్యాగ్ లేకుండా వెళ్ళాలని ప్రభుత్వం నిర్ణయించి అన్ని విద్యాసంస్థలకు ఆదేశాలను కూడా జారీ చేసింది.

నిబంధనలు విస్మరిస్తున్న యాజమాన్యాలు

ఉమ్మడి జిల్లాలో 'నో స్కూల్ బ్యాగ్ డే' కార్యక్రమం అంతంత మాత్రంగానే అమలవుతుంది. విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినా అమలు చేయడంలో అడుగడుగునా నిర్లక్ష్యం కన్పిపిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తుంది. గతంలో 1 నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు 'నో బ్యాగ్ డే' ను అమలు చేయాలని ఆదేశాలుండేవి. ఈ విద్యా సంవత్సరం నుంచి 1 నుంచి రెండో తరగతి వరకూ మాత్రమే ఈ కార్యక్రమంను అమలు చేయాలని ఇటీవలే ఉత్తర్వులు అందాయి.ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమం సక్రమంగానే అమలవుతున్నా పలు ప్రైవేటు విద్యాసంస్థలు నో బ్యాగ్ డే ను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 1800 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 3.20 లక్షల మంది విద్యార్థులు ఏటా చదువుతున్నారు. ఇక్కడ మాత్రం నో స్కూల్ బ్యాగ్ డే విధానానికి తూట్లు పొడుస్తున్నరన్న ఆరోపణలు ఉన్నాయి.

పట్టించుకోని విద్యాశాఖ

బండెడు బరువుతో పాఠశాలలకు వెళుతున్న పలువురు విద్యార్థులు పుస్తకాల బ్యాగులను మోయలేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. నడుం నొప్పితో బాధ పడుతూ నరాల బలహీనతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నో బ్యాగ్ డే కార్యక్రమం అమలుకు పూనుకుంది. ఒకటి నుంచి రెండో తరగతి వరకూ ఉన్న విద్యార్థులకు నెలలో మొదటి, మూడో శనివారం దీనిని కచ్చితంగా అమలు చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కేవలం పుస్తకాలకే పరిమితమైపోతున్న విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేసి సృజనాత్మకతను వెలికితీయాలనే సదుద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం జిల్లాలో ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల నిర్వాకంతో నీరు కారిపోతుంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు విద్యాసంస్థలు యథేచ్ఛగా ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నా విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, అమలాపురం, మండపేట తదితర ప్రాంతాల్లో సక్రమంగా అమలు చేయడం లేదు. ఈ మూడో శనివారం నో బ్యాగ్ డే ను ఎలా అమలు చేస్తారో చూడాలి.

ఆనంద పాఠాలను బోధించాలి

నో బ్యాగ్ డే రోజున ఉపాధ్యాయులు ఆనంద పాఠాలు బోధించేలా ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. ఉదయం నాలుగు తరగతుల్లో నీతి కథల బోధన, చిత్రలేఖనం, నైతిక విలువలు, సేవా కార్యక్రమాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలి. అనంతరం క్రీడలు, యోగాసనాలపై శిక్షణ ఇవ్వాలి. కథలు చదవడం, చెప్పడం, అనుభవాలు పంచుకోవడం, పొడుపు కథలు, పజిల్స్, సరదాగా ఆటలు ఆడించాలి. పాఠశాలల్లో సాగు చేస్తున్న బడి తోటలో పాదులు వేయడం, కలుపు తీయడం, పందిరి వేయడం, ఎరువులు వేయడం వంటి వాటిని అలవాటు చేయాలి. గ్రంథాలయాల్లో పుస్తకాలను ఎంపిక చేసుకుని చదవడం, వాటిపై చర్చించే అంశాలు నేర్పించాలి. ఆరోగ్య కార్యకర్తలు, మున్సిపల్, వ్యవసాయదారులు, తదితర పెద్దలను పిలిచి పిల్లలతో మాట్లాడించాలి. 1, 2 తరగతుల విద్యార్థులకు ఇంటి పని (హోమ్ వర్క్) ఇవ్వకూడదు. జాతీయ విద్యా పరిశోధన మండలి సూచనల ప్రకారం 1, 2 తరగతులకు భాష, గణితం, 3, 4 తరగతులకు సామాన్య శాస్త్రం, గణితం తప్ప ఇతర సబ్జెక్ట్ పుస్తకాలు ఉండకూడదు. అదనపు పుస్తకాలు తీసుకు రావాలని యాజమాన్యాలు ఒత్తిడి చేయకూడదు. అదనపు మెటీరియల్ ఇచ్చినా అవన్నీ కలిపి కేంద్ర మానవవనరుల అభివద్ధి శాఖ సూచించిన పుస్తకాల బరువును మించకూడదు. వీటిని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పాటించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

పుస్తకాలు లేకుండా బోధన ఎలా?

- అంగన్‌వాడీలకు అందని పాఠ్య పుస్తకాలు
- ప్రయివేటు స్కూళ్ల వైపు తల్లిదండ్రుల మొగ్గు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పాలకుల విధానాల ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాలు డీలా పడుతున్నాయి. బాల్య దశ నుంచే చిన్నారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యతను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విస్మరిస్తున్నాయి. అంగన్వాడీ బడుల్లోకి చిన్నారులు వచ్చేలా, స్కూల్ పట్ల ఆసక్తి కలిగించేలా ఆటపాటలతో కూడిన విద్య. బొమ్మలున్న పుస్తకాలను అందజేయాల్సి ఉంది. గతంలో ఆహ్లాదకరంగా వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో చిన్నారులు ఉత్సాహంగా అంగన్వాడీ బడిబాట పట్టారు. అయితే తాజా పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్నాయి. ఈ ఏడాది అంగన్‌వాడీలకు అందించాల్సిన పాఠ్యపుస్తకాలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. పాత పాఠ్య పుస్తకాలతోనే కాలం గడిపేయాలనే అనధికార ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో అంగన్వాడీ సిబ్బంది సైతం చేసేది ఏమీ లేక పాత పుస్తకాలతో సరిపెడుతున్నారు. జిల్లాలోని ప్రాజెక్టుల పరిధిలో 1,550 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో చిన్నారులు 92,595 మంది న్నారు. వీరిలో ఆరు నెలలోపు చిన్నారులు 9,113 కాగా ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 48,404 మంది ఉన్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 35,078 మంది ఉన్నారు. గర్భవతుల సంఖ్య 1,387 కాగా బాలింతల సంఖ్య 1,119గా ఉంది. గతేడాది చిన్నారుల సంఖ్య 93,611 కాగా 6 నెలలోపు చిన్నారులు 9,510, ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 49,909 మంది మూడు సంవత్సరముల నుంచి ఆరు సంవత్సరములలోపు చిన్నారులు 34,309 మంది ఉన్నారు. గత ఏడాదితో పోల్చితే చిన్నారుల సంఖ్య 1016 మంది చిన్నారులు తగ్గినట్లు సుస్పష్టం. ప్రతి ఏటా జూన్ నెలకే అంగన్, వాడీల్లోని చిన్నారుల చేతికి కొత్త పుస్తకాల కిట్లు చేరేవి. ఈ ఏడాది రెండు నెలలైనా ఇంత వరకు కొత్తపుస్తకాలు రాకపోవడంతో గతంలో ఇచ్చిన వాటితోనే అంగన్వాడీ టీవర్లు బోధన కొనసాగిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన జూన్ నెలలోనే 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు ఆంగ్లం, గణితం స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సం బంధించిన ఐదు పుస్తకాలతో కూడిన సీపీ 1, కిట్లు, సీపీ 2 కిట్లు అందించేవారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు బొమ్మలతో కూడిన పుస్తకాలను చూపిస్తూ చిన్నారులకు విద్యను బోధించడం సులువుగా ఉండేది. పిల్లలు కూడా ఆసక్తిగా పాఠాలు నేర్చుకునే వారు, అంగన్వాడీల్లో ఇం గ్లిషు విద్య బోధన చిన్ననాటి నుంచే జరుగు తుండటంతో ఠంచనుగా అంగన్వాడీ కేంద్రాలకు తమ పిల్లలను తల్లిదండ్రులు పంపించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో అంగన్వాడీల్లో చిన్నారుల విద్యా బోధన మొక్కుబడి తంతుగా మారింది. కొత్త పుస్తకాలు ఇస్తారో.. లేదో అన్న సందేహంతో చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూల్కు పంపేందుకు మొగ్గ చూపు తున్నారు.

అందుబాటులో ఉన్న పుస్తకాలతో బోధిన

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాదికి సంబంధించిన కొత్త పాఠ్య పుస్తకాలు రాలేదు. ప్రతి ఏటా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయరు. చిన్నారులకు కావాల్సిన వర్క్‌బుక్‌లు ఇతర పుస్తకాలు వచ్చిన వెంటనే ఆయా కేంద్రాలకు అందజేస్తాం. ప్రస్తుతం మా వద్ద ఉన్న పాత పాఠ్య పుస్తకాలతోనే బోధిస్తున్నాం. ప్రతి ఒజూ టైమ్ టేబుల్ ప్రకారం అన్ని స్కూళ్లలో చిన్నారులకు విద్యా బోధన జరుగుతోంది.

- కె.విజయకుమారి ప్రాజెక్టు డైరెక్టర్ ఐసిడిఎస్.

'ప్రగతి' సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి - కడియం

సామాన్య మధ్యతరగతి పేద విద్యార్థులకు ప్రగతి విద్యానికేతన్ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ, మాజీ ఎంపిపి మార్గాని సత్యనారాయణ అన్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ప్రగతి విద్యానికేతన్‌లో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు విచ్చేసి మాట్లాడారు. పూర్తి గ్రామీణ ప్రాంతమైన కడియపులంకలో మూడున్నర దశాబ్దాలుగా ఏర్పాటు చేసిన ప్రగతి విద్యానికేతన్ నామమాత్రపు ఫీజులతో పేదలకు మెరుగైన విద్యను అందిస్తుందన్నారు. ఎందరో పేద, మధ్యతరగతి విద్యార్థుల జీవితాల్లో ప్రగతిని నింపుతుందన్నారు. సేవా దృక్పథంతో ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కరస్పాండెంట్ క్రరి యోహాన్ అభినందనీయులన్నారు. ఈ విద్యా సంస్థను మరింత ముందుకు తీసుకెళ్లాలని గ్రామానికి, మండలానికి మరింత పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు వారు బహుమతులు అందించారు. అనంతరం క్రరి యోహాన్, ఉపాధ్యాయ బృందం శాలువ, పూలమాలలతో వారిని సత్కరించారు.

డిఎస్‌సి కోచింగ్ సెంటర్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -గోకవరం

జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో నెహ్రూ ట్రస్ట్ తరపున ఏర్పాటు చేసిన డిఎస్‌సి, టెట్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని గోకవరం మండలం క్లస్టర్-1 ఇన్‌ఛార్జి కన్నబాబు తెలిపారు. అర్హత గల నిరుద్యోగులు జగ్గంపేటలో ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు.

కార్టూ'నిజం'



పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అన్నార్తుల ఆకలి తీర్చేదే 'అన్న' క్యాంటీన్ అని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో క్వారీ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి, గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్లను ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ, కలెక్టర్ పి.ప్రశాంతి, నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గర్గ్, జనసేన పార్టీ రాజమండ్రి ఇన్‌ఛార్జి అత్తి సత్యనారాయణలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వారితో కలిసి క్వారీ సెంటర్ అన్న క్యాంటీన్లో అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల క్షుద్బాధను తీర్చడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం అనేది సిఎం చంద్రబాబు నినాదమన్నారు. అందుకే అన్న క్యాంటీన్లను పున:ప్రారంభించారన్నారు. జగన్ సంక్షేమ పథకాల పేరుతో రూ.10 ఇచ్చి దొడ్డి దారిన ప్రజలపై పన్నుల భారాలు మోపి రూ.100 లాక్కున్నారని విమర్శించారు. జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరంలో మూడు అన్న క్యాంటీన్లు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం భోజనం మూడు వేళల్లో అన్నా క్యాంటీన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. రు.15కే భోజనం, అల్పాహారం అందిస్తామన్నారు. టోకెన్లు జారీ చేసి తదుపరి ఆమేరకు ఆహారం అందిస్తామన్నారు. కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు నాణ్యమైన భోజనాన్ని ప్రతిరోజు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో అన్నకాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు రూరల్ :

పేదల ఆకలిని తీర్చేందుకే ప్రభుత్వం అన్నా కాంటీన్లను ఏర్పాటు చేసిందని, పేదల కడుపు నింపిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుదని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు బస్టాండ్ సమీపంలో అన్న క్యాంటీన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఉదయం ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని ఆయన స్వయంగా వడ్డించారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్‌టిఆర్ రాజకీయాల్లోకి వచ్చారన్నారు. పేదలకు తిండి, బట్ట, గృహం కచ్చితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారన్నారు. ఆయన స్ఫూర్తితో సిఎం చంద్రబాబు అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బారాయచౌదరి, అర్బన్ బ్యాంకు అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ, పార్టీ నాయకులు సూర్యదేవర రంజిత్ తదితరులు పాల్గొన్నారు

రాజమహేంద్రవరం అన్న క్యాంటీన్‌లో వడ్డిస్తున్న ఎంఎల్‌ఎ వాసు, కలెక్టర్, కమిషనర్

జూనియర్ వైద్యురాలి ఘటనలో నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కోల్‌కత్తలోని అర్జికార్ వైద్య కళాశాల ఆసుపత్రిలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం నిరసన తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.భానుప్రసాద్ మాట్లాడుతూ పోస్ట్‌మార్టం రిపోర్టు ఆధారంగా ఆమెపై సామూహిక అత్యాచారం జరిగినట్టు తెలుస్తుందన్నారు. ఈ కేసును నిష్పక్షపాతంగా విచారణ చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో విద్యార్థులకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పాలకవర్గాల ప్రతినిధి ఎంఎన్‌సి కంపెనీలకు రక్షణ కల్పించినంతగా దేశంలోని విద్యార్థులకు, మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్, రాజమండ్రి పట్టణ కార్యదర్శి దినేష్‌కుమార్, రోహిత్, జ్యోతి, శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడు సుబ్రహ్మణ్యంకు సత్కారం

ప్రజాశక్తి - చాగల్లు

మంచినీటి ట్యాంకు క్లోరినేషన్ ప్రక్రియలో నూతన ఒరవడి సృష్టించిన పంచాయతీ అవుట్ సోర్సింగ్ కార్మికుడు సుబ్రహ్మణ్యంను చాగల్లు సర్పంచ్ యు.మనశ్శాంతి, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ కేతసాహెబ్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్, ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిఎన్.మూర్తికి ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి-గోకవరం

పశంసా పత్రాన్ని అందుకున్న డి ఎన్ మూర్తి

మండలం కొత్తపల్లి పిహెచ్‌సిలో ఆరోగ్య విస్తరణాధికారిగా విధులు నిర్వహిస్తున్న డిఎన్.మూర్తికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి వైద్యాధికారులు తిరన్, నిఖిత, సునీల్, ఆలేఖ్య, సూపర్ వైజర్స్, వైద్య సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పురస్కారం వైద్య సిబ్బంది సమిష్టి కృషి ఫలితమన్నారు. దీన్ని సిబ్బందికి అంకితం చేస్తున్నానని తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తెలిపారు. మండల విద్యాశాఖాధికారులు వారి పరిధిలో గల పాఠశాలల నుంచి ఒక ఉపాధ్యాయుడు అనగా సెకండరీ గ్రేడ్ టీచర్, తత్సమానమైన ఉపాధ్యాయులు లేదా ఒక ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుడు, ఉపవిద్యాశాఖాధికారులు వారి పరిధిలో గల పాఠశాలల నుండి ఒక ఉపాధ్యాయుడును అనగా స్కూల్ అసిస్టెంట్ మరియు తత్సమానమైన ఉపాధ్యాయులు లేదా ఒక ప్రధానోపాధ్యాయుని ప్రతిపాదనలను మాత్రమే నిర్ణీత నమూనాలో పంపాలన్నారు. ఈ నెల29లో మండల కమిటీ/డివిజనల్ కమిటీల ఆమోదంతో కార్యాలయంలో అందించాలన్నారు. నిర్ణీత తేది తర్వాత సమర్పించిన దరఖాస్తులు తిరస్కరిస్తామన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కెవి కొంతమూరు సబ్ స్టేషన్‌లోని 11కెవి కళ్యాణ్‌నగర్ ఫీడర్‌లో లైన్ నిర్వహణ పని నిమిత్తం కొంతమూరు గ్రామంలోని శ్రీరామ్‌నగర్, కళ్యాణ్ నగర్, ఆదర్శ నగర్, ఎంప్లాయీస్ కాలనీ, జంగాల కాలనీ, బీసీ కాలనీ, శేషాద్రి లేఅవుట్, క్వారీ ఏరియా, వివి కొండయ్య నగర్, 4వ బ్రిడ్జి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ అధికారులు తెలిపారు .అలాగే 11 కెవి ఆర్‌టిసి డిపో ఫీడర్ పరిధిలో ట్రీకటింగ్ నిమిత్తం గాంధీపురం,-3, శీలం నూకరాజు కంపెనీ లైన్, శ్యామలనగర్, గోరక్షణ పేట, డైమండ్ పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 33/11 కెవి శాటిలైట్ సిటీ సబ్ స్టేషన్ పరిధిలో బుచ్చయ్య నగర్, రాక్ చర్చ్, శ్రీలక్ష్మీ నగర్, అమరావతి లేఔట్, సింగపూర్ సిటీ, మల్లింనగర్, ఇందిరమ్మ కాలనీ, ఎ,బి,సి, డి బ్లాకులు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వేంకటేశ్వర నగర్ సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి బైబిల్ ప్లేస్ ఫీడర్ పరిధిలో మున్సిపల్ పనులు నిమ్మితం ఎవి.అప్పారావురోడ్డు, సాయి టవర్స్, నేతాజీ టవర్స్, బాలాజీస్ట్రీట్, శారదనగర్, షీలానగర్, గోపాలనగర్ పుంత, శ్రీనివాసగార్డెన్స్, అద్దేపల్లికాలనీ, ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కోలమూరు ఫీడర్ మరమ్మతుల కారణంగా 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ కొంతమూరు గ్రామంలో ఎస్ఎస్ఆర్ఆర్ లేఅవుట్, సున్నంబట్టీ రోడ్డు, రాజరాజేశ్వరి నగర్, నూకాలమ్మ ఆలయ ప్రాంతం, మెయిన్ రోడ్డు, అఫిషియల్ కాలనీ, చందన రమేష్ లేఅవుట్, చెంచు కాలనీ, విడో కాలనీ, తేజా నగర్‌లకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని తెలిపారు. మల్లయ్యపేట విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని రామదాసు పేట ఫీడర్ పనుల నిమిత్తం పేపర్ మిల్ క్వార్టర్స్ ఏరియా, ఆనంద నగర్ ఏరియా సిసి కాలనీ ఏరియా, ఇంద్ర నగర్ ఏరియా, గాదిరెడ్డి నగర్ ఏరియా, వెంకటాపురం ఏరియా, రామదాసుపేట ఏరియాలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 8 గంట నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకూ పుష్కరఘాట్, గోదావరి బండ్, భీమరాజు వీధి, ఇసుక వీధి, రంగ్రీజు పేట, చంద సత్రం, గుండువారి వీధి, సదనం, వంకాయలవారి వీధి, కోటగుమ్మం డౌన్ ఏరియాల్లో, ట్రైనింగ్‌కాలేజీ, స్టేడియం వెనుక వైపు, చిడిగిపేట, మంగళవరపుపేట ఏరియాల్లో తుమ్మలోవ ఫీడర్ పరిధిలో కృష్ణానగర్, కొర్లంపేట , ఆర్యపురం, తుమ్మలోవ , రామచంద్రరావు పేట, సాంబశివరావు, ఆర్యాపురం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ స్వరూప్ నగర్ ఫీడర్ లైన్‌లో పనులు మరమ్మత్తులు నిమిత్తం శాస్త్రి గారి స్ట్రీట్, ధనలక్ష్మి స్ట్రీట్,. ప్రకాష్ నగర్ రౌండ్ పార్క్, గాంధీ పురం 2, గాంధీ పురం 3, లైఫ్ మెడికల్, ముగ్ద షాపింగ్ మాల్ ఏరియా, శ్యామల నగర్, పంచవతి, జాగృతి బ్లడ్ బ్యాంక్, ప్రకాష్ నగర పోలీస్ స్టేషన్ ఏరియా, శ్యామల నగర్ రామాలయం సెంటర్, మరియు స్వరూప్ నగర్, బత్తిన్ నగర్, ఆల్వాల్ నగర్, ఇండస్ట్రియల్ ఏరియా, సాయి దుర్గ నగర్, నారాయణపురం, సైక్లోన్ కాలనీ, మరియు గాదిరెడ్డి నగర్. ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని అధికారులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ ఆసౌకర్యమును గమనించి డిపార్ట్ మెంట్ వారికి సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

వీర్రాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అశోక్

కరెంట్ షాక్‌తో కూలీ మృతి

ప్రజాశక్తి-ఆలమూరు

కరెంట్ షాక్ తో ఒక కూలి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని గుమ్మిలేరుకు చెందిన ముచ్చారి వీర్రాజు (45) మోతుకూరు గ్రామ పరిధి చెలలో పశువులకి పచ్చగడ్డి కోసుకుని చెరువు గట్టుపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు 33 కెవి విద్యుత్తు సరఫరా వైర్ గడ్డి మోపునకు తగలడం వలన షాక్ కు గురై అక్కడికక్కడే వీర్రాజు మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు సంతానం కలరు. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ అశోక్ ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి-రాజోలు

హత్య కేసుల్లో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సహజీవనం చేస్తున్న వ్యక్తి పెట్టే వేధింపులు భరించలేక పథకం ప్రకారం ప్రియురాలు హత్య చేయించిందనని రాజోలు ఆర్.గోవింద రాజు తెలిపారు. ఈ నెల 13న చించినాడ బ్రిడ్జి వద్ద హత్యకు గురైన పడమటి నోయల్ జార్జ్ కేసును పోలీసులు గంటల వ్యవధిలో ఛేదించారు. రాజోలు సిఐ ఆర్. గోవిందరాజు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి వివరాలను మీడియాకు వెల్లడించారు.గుడిమెళ్ళంక గ్రామానికి చెందిన రాపాక ప్రశాంతి మలికిపురానికి చెందిన పడమటి నోయల్ జార్జ్‌లు ఆరు నెలలుగా ప్రేమించుకుంటూ కాకినాడలో సహజీవనం సాగిస్తున్నారు. నోయల్ జార్జ్ చెడు వ్యసనాలకు బానిసైయ్యాడు. తనతో పాటు ప్రశాంతిని కూడా తాగమని వేధించేవాడు. ఈ నెల 9న కాకినాడ నుంచి ఇంటికి వచ్చి నోయల్ జార్జ్ వేదిపుల గురించి అన్నయ్య ప్రకాష్‌కు తెలిపింది. దీంతో వారు నోయల్ జార్జ్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం అదే రోజు రాత్రి రాపాక ప్రశాంతి సెల్ నుండి నోయల్ జార్జ్‌కి ఫోన్ చేయించి దిండి- చించినాడ బ్రిడ్జి వద్దకు రప్పించారు. వాళ్ల అనుకున్న ప్రకారం ఇనుప రాడ్లతో నోయల్ జార్జిని కొట్టి హతమార్చారు. అతనిని గోదావరి బ్రిడ్జి పై నుండి గోదావరిలోకి పడవేశారు. నోయల్ జార్జ్ వేసుకు వచ్చిన బండిని బ్రిడ్జి వద్ద పెట్టి అక్కడ నుండి నోయల్ జార్జ్ తప్పిపోయినట్లు సృష్టించి పారిపోయారు. రెండు రోజుల తర్వాత నోయల్ జార్జ్ తండ్రి పడమటి రత్నం రాజు తన కుమారుడు కనిపించడం లేదని మల్కిపురం పోలీస్‌కు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా ఈ నెల13న వ నోయల్ జార్జ్ మతదేహం అంతర్వేది పల్లిపాలెం అన్నా చెల్లెలు గట్టు సమీపంలో గోదావరి ఒడ్డున దొరికింది. దీనిపై రాజోలు సిఐ గోవింద రాజు, మల్కిపురం, సఖినేటిపల్లి ఎస్ఐలు సురేష్, రాము దర్యాప్తు ప్రారంబించారు. శుక్రవారం దిండి చెక్ పోస్టు వద్ద ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టు లో హాజరు పరిచినట్లు సిఐ గోవిందరాజుల తెలిపారు.

గోదావరిలో యువకుని గల్లంతు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కోటిపల్లి వద్ద గోదావరిలో స్నానానికి దిగిన ఇద్దరు స్నేహితుల్లో ఒకరు గల్లంతైన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. రామచంద్రపురం మండలం తోటపేట గ్రామానికి చెందిన కందుల నరేంద్ర(26) అతని స్నేహితుడు కంచిమర్తి అంజి ఇద్దరూ ద్రాక్షారామం నుంచి కోటిపల్లి గోదావరి స్నానానికి వెళ్లారు. ఇక్కడ గల పుష్కర్ ఘాట్ వద్ద స్నానం ఆచరిస్తూ నరేంద్ర గోదావరిలో మునిగిపోయాడు. అదే సమయంలో ప్రమాదంలో ఉన్న అంజిని స్థానికులు కాపాడారు. శుక్రవారం నరేంద్ర కోసం గాలించిన రాత్రి సమయంలో వీలుపడలేదు. దీనిపై కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గల్లంతైన యువకుడు పామర్రు లోని ఒక పాల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్లు తెలిసింది.

పేకాట శిబిరాల పై దాడులు

ప్రజాశక్తి-జగ్గంపేట

మండలం లోని జె. కొత్తూరు గ్రామం లో శుక్రవారం రాత్రి జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధ రావు తన సిబ్బంది తో పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామ శివారు రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడులు చేశారు. ఈ దాడుల్లో నలుగురు పేకాడతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 3,200 రూపాయల నగదును, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరిని శనివారం ఉదయం కోర్టులో హాజరు పరుస్తామన్నారు. జగ్గంపేట మండల పరిధిలో పేకాట, కోడిపందాలు వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎన్ఎం దుర్మరణం

ప్రజాశక్తి -సామర్లకోట

సామర్లకోట - పెద్దాపురం ఎడిబి రోడ్డులోని రాక్ సిరామిక్స్ పరిశ్రమ సమీపంలో దిగిన రోడ్డు ప్రమాదంలో సామర్లకోట మండలం ఉండూరు గ్రామానికి చెందిన ఏఎన్ఎం నాగ సత్యవేణి (39) దుర్మరణం చెందారు. పెద్దాపురం ఏడిబి రోడ్డు మీదుగా మోపెడ్ వాహనంపై వెళుతున్న లారీ ఢీకొట్టగా ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే ఆసపత్రిలో ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు ఉండూరు గ్రామ సచివాలయ పరిధిలో ఏఎన్ఎంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తోంది. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పసివానితో ఉన్న మహిళ

అమ్మకానికి పసి బాలుడు

పోలీసులు అప్పగించిన స్థానికులు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

కొత్తపల్లి ఎస్‌సి పేట సమీపంలో 8 నెలల ఉన్న పసి బాలుడిని రూ.40 వేలకు అమ్మకానికి పెట్టిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని ఒక మహిళ సంచిలో పసి బాలుడి వేసుకొని రూ.40 వేలకు అమ్ముతానంటూ కొత్తపల్లి గ్రామంలో సంచరించింది. గమనించిన స్థానికులు ఆ మహిళలను నిలదీశారు. ఆమె బెంగాలీ, ఒడియ భాషల్లో మాట్లాడుతుండడంతో అనుమానించిన గ్రామస్తులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ మహిళలను పోలీస్ స్టేషన్ తరలించారు. మహిళ మద్యం సేవించి ఉందని స్థానికులు తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన తెలపుతున్న సిబ్బంది

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపో షాప్స్, సూపర్‌వైజర్లు శుక్రవారం నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను సానుకూలంగా అర్థం చేసుకోవాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. షాప్స్ వద్ద 10 నిముషాలు ప్లకార్డులతో శాంతియుతంగా నిరసన తెలిపారు.

ఆదిత్య అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ మేనేజ్మెంట్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ పిఎన్‌వివి.సత్యనారాయణకు కోయంబత్తూరు భారతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్టు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణారెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ పుచ్చకాయల ఎన్‌వివి.సత్యనారాయణ సమర్పించిన థీసిస్ విశ్వవిద్యాలయం అధ్యాపకుడు డాక్టర్ వి.రామానుజన్ పర్యవేక్షణలో అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో నూతన ఇన్సాల్వెన్సీ చట్టం ద్వారా ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలను ఎంతవరకు సాధించింది, భవిష్యత్తు అవకాశాలు ఎంతవరకు ఉన్నాయి, లోటు పాట్లు, అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలపై తులనాత్మకంగా విశ్లేషణ చేశారని తెలిపారు. డాక్టర్ సత్యనారాయణను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని మేనేజ్‌మెంట్ విభాగంలో పరిశోధనలు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎ.విజయ భార్గవి, విభాగాధిపతి ఎం.గోవర్ధన్ రెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సత్యనారాయణను అభినందించారు.

ఆర్థిక సాయం అందిస్తున్న సురేష్ బాబు

అంబేద్కర్ విద్యా జ్యోతి పథకంలో సాయం

ప్రజాశక్తి-కోటనందూరు

అంబేద్కర్ కెనరా విద్యా జ్యోతి పథకం ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని అందించినట్టు కెనరా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఎంవి.సురేష్ బాబు తెలిపారు. 2023-24 సంవత్సరానికి 5, 6, 7 తరగతులకు చదువుతున్న వారికి ఒక్కొక్కరికీ రూ.మూడు వేలు, 8, 9, 10, తరగతిలో చదువుతున్న వారికి ఒక్కొక్కరికీ రూ.ఐదు వేల నగదును విద్యార్థులకు అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సురేష్‌బాబు మాట్లాడుతూ విద్యతోనే దేశాభివద్ధి సాధ్యపడుతుందని, పేద విద్యార్థులను విద్యాపరంగా ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతోనే ఇలాంటి సేవా కార్యక్రమాలు కెనరా బ్యాంక్ చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయమణి, లక్ష్మణ్, భవాని, ప్రసాదరావు, నానాజీ, సంతోష్, ఆదియ, చంద్రబాబు పాల్గొన్నారు.

తునిని అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి-కోటనందూరు

తుని నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివద్ధి చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. శుక్రవారం తుని సాయి వేదికలో ఉపాధి హామీ ఫీల్ అసిస్టెంట్లు, విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పరిచయ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మాట్లాడారు. తుని నియోజకవర్గంలో కోన ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. తుని ఎంఎల్ఎ యనమల దివ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య ఆరోగ్యంపైన ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అత్యధిక నిధులు కేటాయించినట్టు తెలిపారు. మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్ బాబు, టిడిపి నాయకులు గాడి రాజబాబు, మోత్కూరు వెంకటేష్, చింతమనేడి అబ్బాయి, ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, అంకమరెడ్డి బుల్లిబాబు, సుర్ల లోవరాజు, అంకమ్మ రెడ్డి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ చెరువు పూడ్చివేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి -సామర్లకోట

సామర్లకోట శివారు సత్యనారాయణపురం, జగ్గమ్మగారిపేటలో పాత సబ్ రిజిస్ట్రారు ఆఫీసు వెనుకవైపు ఇరిగేషన్ చెరువును ఆక్రమించేందుకు పూడుస్తున్నారనే ఫిర్యాదు మేరకు తహసీల్దార్ కె.చంద్రశేఖర రెడ్డి శుక్రవారం చెరువును పరిశీలించారు. మండల సర్వేయరు, గ్రామ రెవెన్యూ అధికారితో కలసి చెరువు భూమిని ఆయన పరిశీలించారు. పనులను నిలిపివేయాలని రైతు కొప్పిశెట్టి రవిని ఆదేశించారు. ఈ సందర్భంగా పనికి ఉపయోగిస్తున్న జెసిబిని చెరువు వద్దనుంచి పంపివేశారు. సంబంధిత అధికారులతో సంప్రదించి నిర్ధారణ తీసుకోనున్నట్టు తెలిపారు.

స్కూల్‌కు రూ.60,000 అందజేత

ప్రజాశక్తి -కరప

గురజనాపల్లి పబ్బినీడీ పాపారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివద్ధి కోసం గ్రామ పెద్దలు రూ.60,000 అందించినట్టు హెచ్‌ఎం ఎ.సాయి మోహన్ తెలిపారు. పాఠశాల అభివృద్ధికి శాశ్వత నిధి ఏర్పాటు చేయాలని హెచ్‌ఎం, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎస్ఎంసి ఛైర్మన్ పి.నూకరాజు ఆధ్వర్యంలో పిలుపు ఇచ్చారు. వెంటనే స్పందించి సమావేశంలో ఉన్న గ్రామ పెద్దలు కర్నాసుల పురుషోత్తమ రావు రూ.25,000, పబ్బినీడి వెంకట కృష్ణ రూ.25,000, జనసేన నాయకులు మాగాపు గోవిందరాజు రూ.10,000 విరాళాలు హెచ్‌ఎంకు అందించారు. దీనిపై హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం ఇతర గ్రామ పెద్దలు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

యానాం వార్తలు

ఘనంగా వేణుగోపాలరావు జయంతి

ప్రజాశక్తి - యానాం

ఫ్రెంచి కాలంలో యానాం పట్టణ మేయర్‌గా వ్యవహరించిన కామిశెట్టి వేణుగోపాలరావు జయంతిని బుధవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్ రివర్ బీచ్ రహదారిలో ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి, ఎస్పి రాజశేఖరన్ మున్సిపల్ కమిషనర్ కండవల్లి రామకృష్ణ, సిఐ షణ్ముగం, ఎస్ఐ మగానందం, కొల్లు ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా డెజూర్ ట్రాన్స్ఫర్ డే

ప్రజాశక్తి - యానాం

డెజూర్ ట్రాన్స్ ఫర్ డే ను శుక్రవారం యానాంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని సంస్థలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. ఫ్రెంచ్ పాలిత పుదుచ్చేరి భారత దేశంలో చట్టబద్ధంగా విలీనమైన రోజును డెజూర్ ట్రాన్స్ఫర్ డేగా నిర్వహించడం ఆనవాయితీ. యానాం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ పార్కులోని స్వాతంత్ర్య సమరయోధుల స్తూపానికి ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకష్ణ, ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గూటం రాంబాబు, ఆదినారాయణ, మున్సిపల్ సిబ్బంది, టిఎస్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ద్వారంపూడి అక్రమాలపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, ఆయన అనుచరులు ఐదేళ్లలో పాల్పడిన అకృత్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు ఎస్పి విక్రాంత్ పాటిల్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. అనంతరం వనమాడి ఎస్‌పికార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. 2020 జనవరిలో ద్వారంపూడి బాలాజీ చెరువు సెంటర్లో జరిగిన ఒక సభలో టిడిపి అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కళ్యాణ్‌పై పరుష జాలంతో అనవసర వ్యాఖ్యలు చేశారన్నారు. దీనిపై తాము అప్పుడు మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. 2021 అక్టోబర్‌లో జిల్లా టీడీపీ కార్యాలయంలో సమావేశం జరుగుతుండగా ద్వారంపూడి మనుషులు, రౌడీషీటర్లు, వాళ్ళ అనుచరులు గుంపులుగా వచ్చి తమ పార్టీ రాష్ట్ర నాయకుడు కొమ్మారెడ్డి పట్టాభితో పాటు పలువురు నాయకులపై దాడి చేసి విధ్వంసం చేయించారన్నారు. చర్యలు తీసుకోవాలని అప్పుడు జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలూ చేపట్టలేదన్నారు. 2019 నవంబర్లో సంజయ్ నగర్ రాజీవ్ గహకల్ప ప్రాంతంలో ప్రభుత్వం ఇచ్చిన మూడు ఇళ్లను ద్వారంపూడి మనుషులు సుమారు పదిమంది వచ్చి జెసిబితో కూల్చి ధ్వంసం చేశారన్నారు. వారిని అరెస్ట్ చేయాలని పోర్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్లేదన్నారు. ఈ అక్రమాలకు, దౌర్జన్యాలకు సంబంధించిన ఆధారాలను ఎస్‌పికి అందించినట్టు ఎంఎల్ఎ వనమాడి తెలిపారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

- డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్
- పొడగట్లపల్లిలో అన్నక్షేత్రం సందర్శన

ప్రజాశక్తి-కొత్తపేట

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలకు నాణ్యమైన ఆహారాన్ని పొడగట్లపల్లి అన్నాక్షేత్రా నుంచి సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో హరే కృష్ణ ఉద్యమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్షేత్రంను డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆరు అన్న క్యాంటీన్లకు రావులపాలెం మండలం పొడగట్లపల్లిలోని 'హరేకృష్ణ' ఉద్యమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్షేత్రా నుంచి ఆహారం సరఫరా చేస్తున్నారు. ఇక్కడ నుంచి సరఫరా చేస్తున్న ఆహారం, ముడి సరుకుల నాణ్యత, వంట గదులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో వున్న ప్రారంభమైన అన్న క్యాంటీన్లకు పొడగట్లపల్లి అన్న క్షేత్రం నుంచే ఆహారం సరఫరా అవుతుందని.. ఆహారం ముడి సరుకుల నాణ్యత, వంట గదుల శుభ్రత తదితర అంశాలను పరిశీలించామన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఈ అన్న క్షేత్రం నుంచి ప్రభుత్వ కార్యక్రమాలకు, ప్రకతి వైపరీత్యాల సమయంలో ఆహారాన్ని సరఫరా చేస్తారన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఈ అన్నాక్షేత్రం నుంచి ఒక రోజుకు ఎంతమందికి ఆహారం సరఫరా చేయవచ్చునో అని ఆ సంస్థ జనరల్ మేనేజర్ ను ఆరా తీయగా .. రోజుకు 30 వేల మందికి ఆహారం సరఫరా చేయగల సామర్థ్యం ఉన్న కిచెన్ అందుబాటు లో ఉందని మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హరే కృష్ణ ఉద్యమం జోన్ వన్ జనరల్ మేనేజర్ శ్రీరామ్‌ప్రసాద్, రావులపాలెం తహశీల్దార్ ముక్తేశ్వరరావు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొడగట్లపల్లి అన్నక్షేత్రంలో కలెక్టర్

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

అమలాపురం : సిబిఎస్ఇ సిలబస్ అనుబంధ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ బిసి వెల్ఫేర్, ఎపి రెసిడెన్షియల్ స్కూల్స్ హాస్టల్స్ నిర్వహణ, తదితర అంశాలపై సమీక్షించారు.

యువ నాయకులు లక్ష్యాలను నిర్ధేశించుకోవాలి

ప్రజాశక్తి-అంబాజీపేట

యువ నాయకులు రాజకీయ రంగాల్లో లక్ష్యాలు నిర్దేశించుకొని వాటిని సాధించే వరకూ నిరంతరం కృషి చేయాలని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. మాచవరంలో పద్మావతి ట్రేడర్స్ అధినేత, జనసేన నాయకులు మైపాల తాతాజీ పుట్టినరోజు వేడుకలకు శుక్రవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ కేకు కట్ చేయించి పూలదండలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా రాణిస్తూ భవిష్యత్తులో రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యుల, నియోజకవర్గ నాయకులు, జనసైనికులు, అభిమానులు పాల్గొని తాతాజీకి శుభాకాంక్షలు తెలిపారు.

తాతాజీపుట్టినరోజు వేడుకల్లో ఎంఎల్ఎ గిడ్డి, నాయకులు

పాస్‌పోర్ట్ పోయినది

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా విప్పర్తి బుజ్జి, భర్త : సోమరాజు, యర్నగూడెం, దేవరపల్లి మండలం, తూ.గో. జిల్లా అను నేను గౌరీపట్నం మేరీమాత గుడి ఆవరణలో నా హ్యాండ్ బ్యాగ్ నుండి పాస్‌పోర్ట్ మరియు ఆధార్ కార్డు పోగొట్టుకొన్నాను. నా **పాస్‌పోర్ట్ నెం.T8542052**, ఎవరికైనా దొరికినచో నాకు అందచేయవలెను. కాంటాక్ట్ సెల్ : **78425 41719.**

ఎంఎల్ఎ, ఎంపీలకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ డిసి

వాడపల్లిలో యాత్రికుల సౌకర్యాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు నియోజవర్గ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం ఆయన లొల్ల రజక పేట నుంచి ఏటిగట్టు మీదుగా వాడపల్లి వెళ్లే రహదారిని అభివృద్ధి చేసేందుకు రూ.45 లక్షలతో చేపట్టే బిటి రోడ్డుకు అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం వెంకన్న ఆలయ అర్చకులకు నిర్మించిన క్వార్టర్స్‌ను ఆయన ప్రారంభించారు. వెంకన్న ఆలయంలో జరుగుతున్న మూడో రోజు పవిత్రోత్సవాల్లో కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారికి ఎంపీ, ఎంఎల్ఎ ప్రత్యేక పూజలు చేశారు. వీరికి అర్చకులు తొలుతగా ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ డిసి భూపతిరాజు కిషోర్‌కుమార్, ఆలయ మాజీ చైర్మన్ కరుటూరు నరసింహారావు, ఆకుల రామకష్ణ, లొల్ల గ్రామ సర్పంచ్ కాయల జగన్నాథం, ఎం శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై ఎంఎల్‌సి కుడిపూడి హర్షం

ప్రజాశక్తి-అమలాపురం

ఏ రాష్ట్రం నుంచి అయితే ఖనిజ సంపదను యాజమాన్యాలు తరలించుకుపోతున్నాయో ఆదాయంలో సగభాగం రాయల్టీని ఆయా రాష్ట్రాలకు ఇవ్వాలని సుప్రీం కోర్టు జస్టిస్ చంద్ర చూడ్ ఆధ్వర్యంలో 9 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తీర్పు ఇవ్వడంపై ఆంధ్ర ప్రజలు తరపున కతజ్ఞతలు తెలుపుతున్నానని ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ రావు అన్నారు. అమలాపురంలో శుక్రవారం ఎంఎల్‌సి కుడిపూడి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా చమురు సంస్థలైన వేదాంతి, రిలయన్స్, ఒఎన్‌జిసి ఏపీలో రూ.50 లక్షల కోట్లు రాయల్టీ చెల్లించాల్సి ఉందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రానికి చెందిన ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు ప్రయత్నం చేయాలని కోరారు.

ఏరియా ఆసుపత్రిని పరిశీలించిన మంత్రి సుభాష్

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో గల ఏరియా ఆసుపత్రిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణు వార్డులో పర్యటించారు. వారందరినీ పలకరించి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆసుపత్రిలో అందిస్తున్న ఆహారం ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వం ఆసుపత్రుల్లో అందించిన భోజనాలపై నాణ్యత లోపించిందని ప్రస్తుతం రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఈ సందర్భంగా సుభాష్ సూచించారు. మంత్రి వెంట జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది కి మొత్తం నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు దీనికి సంబంధించిన కాంట్రాక్టర్ కు ఫోన్లో జీతాలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. అవుట్ సోర్స్ కార్మికులకు కనీస వేతనం రూ.11,400 చెల్లించాలని కానీ వారికి రూ.8వేలు చెల్లించి పనులు చేయించుకోవడం పై మంత్రి మండిపడ్డారు. కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించకపోతే బిల్లులు నిలిపివేస్తామన్నారు. దీంతో కాంట్రాక్టర్ కొంత మొత్తంలో బిల్లులు చెల్లిస్తామని అంగీకరించారు కనీసం రెండు నెలల జీతాలైనా చెల్లించాలని ఈ సందర్భంగా మంత్రి కాంట్రాక్టర్కు సూచించారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రితో పాటు, టి.కొత్తపల్లి, రాజోలు, ప్రభుత్వా సుపత్రుల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది మంత్రి సుభాష్ ను కలిసిన వారిలో ఉన్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్‌ప్రవీణ్‌ను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట గ్రామంలో కేదార్లంక రోడ్డు నుంచి కైలాస భూమికి వేళ్లే మార్గానికి సిమెంట్ రోడ్డుకు రూ.40 లక్షల నిధులు మంజూర య్యాయి. శుక్రవారం ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, ఎంపీ హరీష్ మాధుర్ నూతన రోడ్డుకు శంకుస్థాపన చేశారు. వ్యవస్థాపకులు లయన్స్ క్లబ్ అధ్యక్షులు, వ్యాపారవేత్త నంబూరి వీర వెంకట రెడ్డియ్య కైలాస భూమి నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. బండారు మాట్లాడుతూ మాట్లాడుతూ పార్థీవదేహాలను కైలాస భూమికి తీసుకొచ్చేందుకు వెహికల్ ఏర్పాటు చేయాలని ఎంపీ హరీష్‌ను కోరారు. విద్యుత్ శాఖకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కంఠం శెట్టి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ బూసి జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE I ADDL SENIOR CIVIL JUDGE, KAKINADA
O.S.NO.95 OF 2023

Between:
Lakkaraju Satyanarain ...**Plaintiff**
and
Vinnakota Sivanand ...**Defendant**

To.Vinnakota Sivanand, S/o. Vinnakota Satyanarayana Murthy, House No. 10-598/1, Eeswar Nagar, Beside III APSP , Kakinada.

పై నెంబరు దావాలో వాదికి రావలసిన బాకీ నిమిత్తం పై దావా దాఖలు చేసి యున్నాము. సదరు దావాలోనూ మరియు రమణయ్యపేట లో గల ప్రతివాదికి చెందిన డో.నెం.**10-598/1**రు గల ఇంటిని జప్తు చేయమని కోరుతూ దాఖలు చేసిన IA నెం.**113/2023**రు గల పిటిషను లోనూ మీ హాజరు నిమిత్తం ది.**28-08-2024** తేదికి వాయిదా అయి ఉన్నది. మీకు ఆక్షేపణలు ఉన్న యడల ఆరోజు ఉదయం **గం. 10.30** నిమిషములకు పై కోర్టులో స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై తెలియ పరుచు కొనవలెను. లేని యడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించడ మగును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

PEPAKAYALA RAMAKRISHNA
MALLIPUDI SATYANARAYANA,
MAGAPU CHAITANYA KUMAR
Advocates, Mehar Bhavan, Ramaraopet
kakinada - 533004
Ph. 9440178750
kakinada
Date : 14-08-2024

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

నా క్లయింటు అయిన లేటు కుడకా రామకృష్ణ గారి భార్య కుడకా సూర్యకుమారి D/o 76-2-5 గోరక్షణపేట రాజమండ్రి వారు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం నాక్లయింటు యొక్క ఒరిజినల్ రిజిష్టర్డ్ దస్తావేజులు నెం. **3556 / 1976** మరియు లింక్ దస్తావేజు **నెం.3424 / 1976** S.R.O.రాజమండ్రి నెంబర్లు గల లింక్ దస్తావేజ్ **ది.13-08-24**వ తేదిన నాక్లయింటు తన ఇంటినుండి తాడితోట సెంటర్‌కు కలర్ జిరాక్స్ నిమిత్తం వెళ్ళచుండగా తాడితోట సెంటర్‌నందు రెండు దస్తావేజులు పడిపోయనవి ఎంతవెతికిన కనిపించలేదు. ఎవరికైన దొరికిన యడల ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాము

కె.శ్రీనివాస్
అడ్వకేటు, గోరక్షణపేట, రాజమండ్రి
సెల్: 9705256019

In The Court Of IV Additional District Judge West Godavari At Tanuku
A.S.No. 8/2022

Between:
Sri Veera Venkata Satyanarayana, Swami vari Devasthanam, Rep. By., its Executive Officer
Appellant/DHR
And
1. Konala Sujana (Claim Petitioner)
2. Ketamgani Srinivasu (1st JDR)
3. Konala Bhagyalakshmi @ Bhagyavathi (2nd JDR) ***...Respondents***

Notice Issued By Way Of Substituted Service Of Summons On 2nd Respondent

2nd Respondent (JDR. No-1) :

Sri Ketamgani Srinivasu S/o Pitchayya, Vegeswara Puram (V), Thallapudi (M), E.G.Dt, (Kovvuru JCJ)

Whereas you are the 2nd respondent in the aforesaid appealsuit and whereas the summons/notices are not served on you in spite of the best efforts of the Decree Holder and whereas the Hon`ble court ordered notice to you in the appeal suit by way of substituted service of summons and whereas you are directed to take this notice and appear before the Hon`ble court **on 30-08-2024 at 10.30 A.M.** either in person or through an advocate to file your defense if any otherwise the matter would be proceeded with in your absence as per law.

You are at liberty to avail the free services of the mandal legal services authority Tanuku subject to your eligibility.

//By Order //
KSLN. VIDYALANKAR
Advocate for appellant/Dhr
Cell: 9440309960

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
Debtor I.P.No.9/2024

Between:
ఆవాల దుర్గయ్య ...పిటీషనర్
And
1.శీరపు హేమంతరెడ్డి, S/o.రామకృష్ణ, హిందు, పురుష, వయస్సు 32 సం॥లు, బిజినెస్, R/o.డోరునెం.3-106, లక్ష్మవరం గ్రామం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం JCJC.
2.బుచ్చి వెంకటరమణ, S/o.శ్రీను, హిందు, పురుష, వయస్సు 40 సం॥లు, బిజినెస్, R/o.డోరునెం..3-125, లక్ష్మవరం గ్రామం, జంగారెడ్డిగూడెం మండలం JCJC.
3.ఒంటెద్దు ఏసురత్నం, S/o.పెద్దిరాజు, హిందు, పురుష, వయస్సు 50 సం॥లు, బిజినెస్, R/o.డోరునెం.5-26, దేవరపల్లి గ్రామం, దేవరపల్లి మండలం, తూ.గో.జిల్లా, కొవ్వూరు JCJC.
4.చింతల వీరన్న, S/o.అంకులయ్య, హిందు, పురుష, వయస్సు 50 సం॥లు, బిజినెస్, R/o.డోరునెం.1-23, కొయ్యలగూడెం గ్రామం, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం - JCJC.
5.చింతాల వెంకన్న, S/o.అంకాలయ్య, హిందు, పురుష, వయస్సు 42 సం॥లు, బిజినెస్, R/o.డోరునెం.1-24, కొయ్యలగూడెం గ్రామం, మండలం, ఏలూరు జిల్లా JCJC.
6.శిరపుత్తుల సతీష్, S/o.సత్యనారాయణ, హిందు, పురుష, వయస్సు 38 సం॥లు, బిజినెస్, R/o.డోరునెం.4-160, లక్ష్మవరం గ్రామం జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా JCJC.
7.అప్పు బొట్టి ఏర్రయ్య, S/o.సత్తియ్య, హిందు, పురుష, వయస్సు 52 సం॥లు, బిజినెస్, R/o.డోరునెం.2-30, కొయ్యలగూడెం, గ్రామం, మండలం, ఏలూరు జిల్లా JCJC.
8.శ్రీమతి దారం వంగ, W/o.వెంకన్న, హిందు, పురుష, వయస్సు 30 సం॥లు, R/o.2-42, కొయ్యలగూడెం, గ్రామం, మండలం, ఏలూరు జిల్లా JCJC.
9.శ్రీమతి ఉర్లంకుల సుజాత, W/o.శ్రీను, హిందు, పురుష, వయస్సు 43 సం॥లు, R/o.డోరునెం.-18, కొత్తపేట, పూళ్లయగూడెం, తాడేపల్లిగూడెం మండలం, ప.గో.జిల్లా., తాడేపల్లిగూడెం JCJC.
10. అపుల రాంబాబు, s/o.తెలియదు, హిందు, పురుష, వయస్సు 43 సం॥లు, బిజినెస్, R/o.డోరునెం. 1-108, కొయ్యలగూడెం, గ్రామం, మండలం, ఏలూరు జిల్లా. JRG JCJC.
11. గద్దే శ్రీరామకృష్ణ, s/o.తెలియదు, హిందు, పురుష, వయస్సు 50 సం॥లు, బిజినెస్, R/o.డోరునెం. 4-90, లక్ష్మవరం గ్రామం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా. JRG JCJC.
12.ది. అఫీషియల్ రిసీవర్, ఏలూరు, ప.గో.జిల్లా, ఏలూరు JCJC ...రెస్పాండెంట్లు

పై నెంబర్ ఐ.పి గ్రంథంలో రెస్పాండెంట్స్ 11 మందికి చెల్లించవలసిన బాకీలు నిమిత్తం పిటీషనరును ఇన్సాల్వెంట్ గా డిక్లేర్ చేయుమని పిటిషన్ దాఖలు చేసినందున యుందు విషయమై ఎవరికైనను ఏట్టి అభ్యంతరములు ఉన్ననూ ది.28-8-2024 తేదీన ఉదయం గం.10.30 నిలకు శ్రీకోర్టు వారు ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేసుకోగలరు.

ఔ.ఉమామహేశ్వరరావు
పి.వెంకటరత్నం,
అడ్వకేట్స్, పిటీషనర్ తరుపు న్యాయవాదులు
స్థలం : కొవ్వూరు
తేది.13.8.2024
కొవ్వూరు.